ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు

శనివారం 20 జూలై 2024

జిల్లా వార్తలు



జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 19: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. శనివారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అధిక వర్షాలు కురుస్తాయన్నారు. అలాగే ఈనెల 24వ తేదీ వరకు పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 3 మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 6 మిల్లీలీటర్లు వర్షపాతం కురుస్తుందన్నారు.



ముంచంగిపుట్టు మండలం దొరగూడ సమీపంలో గెడ్డ దాటుతున్న గిరిజనులు



సీలేరులో వర్షం

మన్యాన్ని వీడని ముసురు

మోస్తరు నుంచి భారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- జడుమురు గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు
- ముంచంగిపుట్టు మండలంలో 50 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- రెండు రోజులు స్కూళ్లకు సెలవు ప్రకటించిన కలెక్టర్

పాడేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం మన్యంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, గెడ్డల పొంగి ప్రవహిస్తున్నాయి. ముంచంగిపుట్టు మండలంలో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రంలో మోస్తరు వర్షం కురిసినా ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, చింతపల్లి, జీకేవీధి, అరకులోయ మండలాల్లో భారీ వర్షం పడింది. తాజా వర్షాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించ లేదు. దీంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. వ్యవసాయ పనులకు తాజా వర్షాలు మేలు చేస్తాయని రైతులు అంటున్నారు.

జి.మాడుగులలో అత్యధిక వర్షపాతం

ఏజెన్సీలో శుక్రవారం జి.మాడుగులలో మండలంలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. డుంబ్రిగుడలో 35.4, ముంచంగిపుట్టులో 45.4, అరకులోయలో 30.2, అనంతగిరిలో 28.6, హుకుంపేటలో 26.8, పాడేరులో 20.8, పెదబయలులో 18.8, చింతపల్లిలో 8.2, జీకేవీధిలో 8.2, కొయ్యూరులో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పాడేరు మండలం బొక్కెళ్లు వద్ద మత్స్యగెడ్డ ప్రవాహం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నంబర్లు: 08935 293120, 08935 293448

తాజా వరదల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం స్థానిక కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. వరదల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే అత్యవసర సాయం, సమాచారం కోసం కంట్రోల్ రూమ్‌లో రెండు ఫోన్ నంబర్లు: 08935 293120, 08935 293448 అందుబాటులో ఉంచామని, నిరంతం కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

చింతపల్లిలో ..

మండలంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు, మోస్తరు వర్షం కురుస్తున్నది. రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, పంట పొలాల్లో వర్షపు నీరు చేరుకున్నది. వర్షం వల్ల జనజీవనం స్తంభించిపోయింది.

గూడెంకొత్తవీధిలో..

మండలంలోని పెదవలస పంచాయతీ జడుమురు గ్రామంలో రాట ధారలక్ష్మి ఇంటి లోపలకు వర్షపు నీరు చేరింది. ఇంటిలోని నిత్యావసర సరకులు, ఇతర సామగ్రి పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది. జాతీయ రహదారి నిర్మాణంలో గిరిజనుల ఇళ్ల కంటే ఎత్తులో రోడ్డు నిర్మించారు. దీంతో రహదారి పైనుంచి నేరుగా వర్షపు నీరు గృహాల్లో వస్తున్నది.

సీలేరు,ధారకొండల్లో..

సీలేరు, ధారకొండ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. జనజీవనానికి తీవ్ర ... మిగతా 8వ పేజీలో

తొణికిసలాడుతున్న జలాశయాలు

సీలేరు కాంప్లెక్స్‌లో మూడు టీఎంసీల జలాలు పెరుగుదల

- జోలాపుట్‌లో 2,708.50 అడుగులు
- బలిమెలలో 1,452.70 అడుగులు
- గుంటవాడలో 1,345 అడుగులు
- డొంకరాయిలో 1006.90 అడుగులు



సీలేరు రెగ్యులేటర్ డ్యామ్‌లో పెరుగుతున్న నిల్వలు

సీలేరు, జూలై 19: సీలేరు నదీ పరివాహక ప్రాంతంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. అన్ని జలాశయాలు జలకళతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు జలాశయాలన్నీ అడుగంటాయి. ఈ తరుణంలో అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల నీటి మట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి.

సీలేరు కాంప్లెక్సు పరిధిలో జోలాపుట్ జలాశయం నీటితో మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తారు. ఈ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 2,750 అడుగులు కాగా ప్రస్తుతం నీటి మట్టం 2708.50 అడుగులకు చేరింది. ఇది ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి ప్రాజెక్టు. ఇక్కడ విద్యుదుత్పత్తి అనంతరం విడుదలైన నీరు బలిమెల జలాశయంలో వచ్చి చేరుతుంది. బలిమెల జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,516 అడుగులు కాగా ప్రస్తుతం 1,452.70 అడుగులకు పెరిగింది. గుంటవాడ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,360 అడుగులు కాగా ప్రస్తుతం 1,345 అడుగులకు చేరింది. డొంకరాయి జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు కాగా, ప్రస్తుతానికి 1006.90 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సులో 3 టీఎంసీల నీటి నిల్వలు పెరిగాయని సీలేరు ఏపీ జెన్‌కో ఈఈ ప్రభాకరరావు తెలిపారు. రానున్న ఆగస్టు, సెప్టెంబర్‌ల్లో సీలేరు నదీ పరివాహకప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తేనే బలిమెల జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు చేరుతాయని జెన్‌కో ఈఈ ప్రభాకరరావు తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న గుంటవాడ జలాశయం

తారాబు సవ్వడి



ఉధృతంగా ప్రవహిస్తున్న తారాబు జలపాతం

పెదబయలు, జూలై 19:

మండలంలోని జామిగూడ పంచాయతీ తారాబు జలపాతం పరవళ్లు తొక్కుతోంది. జలపాతం ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు 300 అడుగుల ఎత్తు నుంచి పాల నురగలా జాలువారుతుండడంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. అయితే జలపాతం ప్రవాహం ఉధృతి అధికంగా ఉండడంతో అక్కడ ఉన్న సిబ్బంది పర్యాటకులను లోపలకు అనుమతించడం లేదు.

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించబోం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్

- గిరిజనులకు ఇబ్బంది కలిగించొద్దు.. తోడ్పాటు అందించండి
- జిల్లా అధికారులతో సమావేశమైన ఎస్టీ కమిషన్ సభ్యుడు

పాడేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంఘాల ప్రతినిధులతో భేటీలో తనకు 40 వరకు వినతులు వచ్చాయని, గిరిజన ప్రాంతంలో సమస్యలుండడం వల్లే అన్ని ఫిర్యాదులు అందాయన్నారు. అందుకు కారణం ఏంటని ఆయన అధికారులను ప్రశ్నించారు. కింది స్థాయి ఉద్యోగులు చేసే తప్పులకు అధికారులు ఎస్టీ కమిషన్ ముందు నిల్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన గుర్తు చేశారు. అలాగే గిరిజన ప్రాంతంలో అమలుచేస్తున్న ప్రభుత్వ పథకాల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గిరిజనులకు ఇబ్బందులు కల్పించేలా అధికారులు, ఉద్యోగులు వ్యవహరించవద్దని, వారికి తోడ్పడేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నకిలీ గిరిజనులపై చర్యలు చేపట్టాలని, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని, మలేరియా, డెంగ్యూ, ఇతర రోగాలను అరికట్టేందుకు కృషిచేయాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర మౌలిక సదుపాయాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశానికి ముందుకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ కలెక్టరేట్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో బి.పద్మావతి, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ధీరజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్, పక్కన కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్, తదితరులు

గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి

పాడేరు గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ అన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగుల భవన్‌లో శుక్రవారం వివిధ సంఘాలకు చెందిన గిరిజన నేతలతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఉద్యోగాలు శతశాతం గిరిజనులకు దక్కేలా జీవో 3ని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. గిరిజన ప్రాంతంలో చెట్టు, పుట్ట, నీరు, గాలి అన్నీ గిరిజనులకు దక్కుతాయన్నారు. అలాగే గిరిజన యువత మత్తులో మునిగి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ప్రభుత్వ పరంగా ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుని బాగుపడాలని ఆయన హితవు పలికారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని, మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేసిన ఘనత ... మిగతా 8వ పేజీలో

విశాఖ డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మపై కేసు నమోదు

- వాహనాలను బలవంతంగా తన ఆధీనంలో ఉంచుకున్నారని హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా కంపెనీ ఎండీ ఫిర్యాదు

అచ్యుతాపురం, జూలై 19:

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలంలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)కు రహదారి నిర్మాణ సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వెంకటరమణయ్యకు, అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కుమారుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ అయిన సుకుమారవర్మకు మధ్య గ్రావెల్ రవాణాకు సంబంధించి ఏవో ఒప్పందాలు జరిగాయి. అయితే క్వారీలో అనుమతులకు మించి గ్రావెల్ తవ్వారన్న అభియోగంపై ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రాకు మైనింగ్ అధికారులు భారీ జరిమానా విధించారు. దీంతో నగదు లావాదేవీల విషయంలో వెంకటరమణయ్యకు, సుకుమారవర్మకు నడుమ విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం కంపెనీకి చెందిన 12 వాహనాలను సుకుమారవర్మ బలవంతంగా తీసుకుపోయి తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆర్‌వీఎస్ ఇన్‌ఫ్రా ఎండీ వెంకటరమణయ్య శుక్రవారం అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వాహనాలను అచ్యుతాపురం మండలం రావిపాలెంలో ఉంచినట్టు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుకుమారవర్మపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

వంతెన లేక గిరిజనం కష్టాలు

- కలగానే బత్తునూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం
- పలు గిరిజన గ్రామాల ప్రజల ఇక్కట్లు - 8లో



నేడే సింహగిరి ప్రదక్షిణ

సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం

- అప్పన్న ప్రచార రథాన్ని ప్రారంభించనున్న అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- విస్తృతంగా ఏర్పాట్లు
- ఈ ఏడాది 8 లక్షల మంది పాల్గొంటారని అంచనా

సింహాచలం, జూలై 19:

భూప్రదక్షిణతో సమానమైన ఫలాన్ని ఒసగే సింహ'గిరి ప్రదక్షిణ' శనివారం సాయంత్రం ప్రారంభం కానున్నది. ఏటా ఆషాఢ మాసంలో శుక్లపక్ష చతుర్దశి నాడు లక్షలాది మంది కొండంత భక్తితో వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలుదీరి ఉన్న సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోంది.

సింహగిరి ప్రదక్షిణ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద ప్రారంభం కానున్నది. స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

గిరి ప్రదక్షిణ మార్గం

తొలిపావంచా వద్ద ప్రారంభమయ్యే భక్తులు పాత అడివివరం, పైనాపిల్ కాలనీ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, అప్పుఘర్, ఎం.వి.పి.కాలనీ డబుల్‌రోడ్డు, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, ఆర్ అండ్ బి, ఎన్‌ఏడీ కూడలి, గోపాలపట్నం, గోశాల మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య ఏడాదిఏడాదికి పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి తమ సిబ్బందితో కలిసి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 80 క్యూలను, 50 ఇనుప గడ్డర్లను ఏర్పాటుచేశారు. అదేవిధంగా రెండో ఘాట్‌రోడ్డు వద్ద నమూనా ... మిగతా 8వ పేజీలో



క్రైం... crime news

మెడికల్ షాపులో చోరీ

» రూ.25 వేల నగదు అపహరణ


మెడికల్ షాపులో క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూలై 19: అనకాపల్లి మండలం కొత్తూరు శారదానగర్‌లోని శ్రీలక్ష్మీ గణపతి మెడికల్ స్టోర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగిందని అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మెడికల్ షాపు యజమాని కొప్పల వీర వెంకట సత్యనారాయణ రోజూ మాదిరిగానే గురువారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడన్నారు. శుక్రవారం ఉదయం పక్క షాపునకు చెందిన వ్యక్తులు షాపు తెరిచి ఉన్న విషయాన్ని సత్యనారాయణకు తెలియజేయడంతో తమ షాపు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. షాపులో ఉన్న రూ.25వేలు అపహరణకు గురయ్యాయని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

లేటరైట్ తవ్వకాల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్

» అడ్డుకున్న గిరిజనులు

నాతవరం, జూలై 19: నాతవరం మండలం సుందరకోట లేటరైట్ ప్రాంతానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులను గిరిజనులు అడ్డుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కొంత మంది వ్యక్తులు మూడు కార్లలో సుందరకోట సమీపంలోని కొండ వద్దకు వచ్చారు. అక్కడ లేటరైట్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని వారు పరిశీలించడానికి వెళుతుండగా సుందరకోట, ఆసనగిరికి చెందిన 20 మంది గిరిజనులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతాన్ని చూడడానికి వచ్చామని ఆ వ్యక్తులు గిరిజనులకు సర్ది చెప్పారు. ముందుకు వెళ్లడానికి వీలు లేదని గిరిజనులు వారిని అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

» తొలుత స్టాండింగ్ కమిటీల కైవసానికి వ్యూహం

» ఆ తరువాత మేయర్ పీఠం...

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీఠంపై టీడీపీ దృష్టిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఎజెండా మేరకు నగరంలో అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై పట్టు ఉండాలని భావిస్తున్న తెలుగుదేశం అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీకి చెందిన సుమారు 22 మంది కార్పొరేటర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ కార్పొరేటర్లు ఈనెల 21వ తేదీ ఆదివారం టీడీపీలో చేరే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగర మేయర్ పదవిపై టీడీపీ గురిపెట్టింది. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే మరికొంతకాలం వేచి ఉండాలి. మేయర్/మునిసిపల్ ఛైర్మన్ పదవుల్లో ఉన్న వారు నాలుగేళ్లు కొనసాగేలా వైసీపీ ప్రభుత్వం చట్టం చేసింది. అందువల్ల మేయర్ పదవిని టీడీపీ చేజిక్కించుకోవాలంటే అసెంబ్లీలో గతంలో చేసిన చట్టానికి సవరణ చేయాలి. అందుకు కొంత సమయం పడుతుంది. ఈలోగా జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీలు కైవసం చేసుకోవాలని నిర్ణయించింది. గురువారం రాత్రి నగరంలోని ఒక హోటల్‌లో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, పార్టీ నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడరు పీలా శ్రీనివాస్, తదితరులు సమావేశమయ్యారు. మేయర్ పీఠం కంటే ముందు స్టాండింగ్ కమిటీలు చేజిక్కించుకోవాలని నేతలు అభిప్రాయపడినట్టు తెలిసింది. అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై ప్రభుత్వానికి పట్టు ఉండాలని, అందుకు సంబంధించి పనులకు ఆమోదం తెలిపే స్టాండింగ్ కమిటీలను కైవసం చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. ఇందుకు అవసరమైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం జీవీఎంసీలో 98 కార్పొరేటర్లలో టీడీపీకి 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టీడీపీ తరఫున గెలిచి వైసీపీకి మద్దతుగా నిలిచిన కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమను ఎట్టి పరిస్థితుల్లో కౌన్సిల్‌లో మద్దతు కోరవద్దని నిర్ణయించినట్టు తెలిసింది. జనసేనకు ముగ్గురు, బీజేపీకి ఒకరు, ఇండిపెండెంట్లు ముగ్గురు ఉన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసీపీకి చెందిన మరో కార్పొరేటర్ ఇప్పటికే టీడీపీలో చేరారు. ఇంకా జీవీఎంసీ పరిధిలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మొత్తం 45 మంది ఉన్నారు. మరో ఐదుగురు సభ్యుల మద్దతు ఉంటే జీవీఎంసీలో కూటమికి మెజారిటీ లభిస్తుంది. అయినా కౌన్సిల్‌లో పటిష్టంగా ఉండాలని భావించిన టీడీపీ నేతలు వైసీపీ నుంచి వచ్చేందుకు సిద్ధమైన 22 మంది కార్పొరేటర్లనూ తీసుకోవాలని నిర్ణయించారు. వైసీపీ నుంచి ఎవరెవరిని తీసుకోవాలనే విషయమై ఎమ్మెల్యేలు గురువారం రాత్రి సమావేశంలో చర్చించారు. అయితే ఆ జాబితాలో ఉన్న ఒకరిద్దరిని పక్కనపెట్టాలని కొందరు ప్రతిపాదించారని తెలిసింది. పార్టీలోకి ఇష్టపూర్వకంగా వచ్చేవారిని మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ ఆదివారం వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నట్టు సమాచారం. తరువాత జీవీఎంసీ సాధారణ సమావేశం నిర్వహణ తేదీ ప్రకటించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలకు చర్యలు

విశాఖపట్నం, జూలై 19: జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేస్తూ మృతి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులకు నియామకాల విధి, విధానాలు, రిజర్వేషన్లు తదితర వాటిని వివరించారు. అర్హులకు వారంలోగా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

దువ్వాడ మీదుగా కొయంబత్తూరు-ధనపూర్‌కు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జూలై 19: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా కొయంబత్తూరు నుంచి ధనపూర్‌కు (ఒకవైపు మాత్రమే) ప్రత్యేక రైలు ప్రవేశపెట్టినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 06185 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 21న (ఆదివారం) రాత్రి 11.30 గంటలకు కొయంబత్తూర్‌లో బయలుదేరి మర్నాడు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ, బుధవారం తెల్లవారుజాము 1.30 గంటలకు ధనపూర్ చేరుతుందని పేర్కొన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

విశాఖపట్నం, జూలై 19: అల్పపీడనం ద్రోణి ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు రైళ్ల రాకపోకలకు ఎటువంటి ప్రభావం చూపలేదు. శుక్రవారం రైళ్లన్నీ యథావిధిగా రాకపోకలు సాగించాయి. విశాఖ నుంచి విజయవాడ మీదుగా పలు ప్రాంతాలకు వెళ్లే జన్మభూమి, వందేభారత్, తిరుమల ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రధాన ఒరిజినేటింగ్ రైళ్లు యథావిధిగా నిర్ణీత సమయానికి బయలుదేరాయి. అలాగే, ఇతర ప్రాంతాలలో బయలుదేరి వయా విశాఖ మీదుగా నడిచే రైళ్లకు కూడా భారీ వర్షాలతో ఎటువంటి ఆటంకం నెలకొనలేదని రైల్వే అధికారులు తెలిపారు. అయితే, ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని శాఖల సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు చెప్పారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని స్టేషన్లలో నిరంతర పర్యవేక్షణ చేపట్టామన్నారు. కాగా, ఇతర డివిజన్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, నిర్ణీత సమయానికి లింక్ రేక్ చేరని కారణంగా రీ షెడ్యూల్ చేసిన పలు రైళ్లు ఆలస్యంగా నడిచినట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఎడతెరిపి లేని వాన

» లోతట్టు ప్రాంతాలు జలమయం


నక్కపల్లి మండలం జానకయ్యపేట వద్ద పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు


పరవాడ పెద చెరువు నిండిపోయి బయటకు ప్రవహిస్తున్న నీరు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో శుక్రవారం వేకువజాము నుంచి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వరద నీటితో వాగులు, చెరువులు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. - అనకాపల్లి/న్యూస్‌నెట్‌వర్క్


కృష్ణాదేవిపేటలోని రహదారి గోతుల్లో వర్షపు నీరు


రాంబిల్లి మండలం వెల్చూరు రోడ్డులో ఇలా..


మాడుగుల మండలం జంపెన వద్ద రోడ్డు ఇలా..

రైవాడ జలాశయం కళకళ

దేవరాపల్లి, జూలై 19: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమ్మెద గెడ్డ, పినకోట చల్లగెడ్డల నుంచి ఐదు వందల క్యూసెక్కుల వరద నీరు మండలంలోని రైవాడ జలాశయంలో చేరిందని డీఈఈ ఆర్.సత్యంనాయుడు తెలిపారు. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, శుక్రవారం 106.3 మీటర్లు వద్ద ఉంది.


నిండు కుండలా రైవాడ జలాశయం

కోనాం జలాశయం వద్ద..


కోనాం జలాశయం మెయిన్‌గేటు ద్వారా వృథాగా పోతున్న నీరు

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, శుక్రవారం సాయంత్రానికి 98.35 మీటర్లకు చేరుకుంది. జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 50 క్యూసెక్కుల నీరు వస్తుండగా జలాశయం మెయిన్‌గేట్లు, దిగువ కాలువ గేట్ల ద్వారా సుమారు 150 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతోంది.

మార్కెటింగ్‌లో రైతులు భాగస్వాములు కావాలి

» కలెక్టరు విజయకృష్ణన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

అనకాపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే వివిధ రకాల పంటలను దళారుల ద్వారా కాకుండా రైతులే స్వయంగా మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకొనే విధానం అమలు చేస్తే మేలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సాగయ్యే వివిధ రకాల పంటలు, వాటి ఉత్పత్తులను రైతులే మార్కెటింగ్ చేసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర అందేవిధంగా రైతు సంఘాలు, మోనటరింగ్ కమిటీలు కృషి చేయాలన్నారు. రైతులకు మేలు జరిగేవిధంగా అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం రైతు ఉత్పత్తుల విధానంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాద్‌రావు, వివిధ రైతు సంఘాలు, మోనటరింగ్ కమిటీల ప్రతినిధులు హాజరయ్యారు.

కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి


» ఇరిగేషన్ అధికారులకు తహసీల్దార్ ఆదేశం


ఇరిగేషన్ అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ రమణారావు

రావికమతం, జూలై 19: కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమణారావు ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ సత్యనారాయణదొరను ప్రస్తుత రిజర్వాయర్ పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 459 అడుగులకు చేరుకుందని తెలిపారు. ఇన్‌ఫ్లో వంద క్యూసెక్కులకు పైగా జలాశయంలోకి వచ్చి చేరుతోందని వివరించారు. సాయంత్రం రెండు గేట్లు ఎత్తి 120 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచి పెట్టి నీటిమట్టాన్ని స్థిరీకరిస్తామని చెప్పారు. దీనిపై రోలుగుంట, మాకవరపాలెం తహసీల్దార్లకు కూడా తెలియజేశామన్నారు. అల్పపీడన ప్రభావం వల్ల నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటిమట్టాన్ని సమీక్షించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీశ్ పాల్గొన్నారు.

సింహగిరి ప్రదక్షిణం భూ ప్రదక్షిణతో సమం

» గిరి ప్రదక్షిణతో కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం



సింహాచలం, జూలై 19: భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. వేదాలు ప్రకృతిని పరమాత్మ స్వరూపంగా పేర్కొన్నాయి. అందుకే అనాదిగా భారతీయులు చెట్లు, పుట్టలు, నదులు, సముద్రాలను, పర్వతాలను పూజిస్తుంటారు. పర్వతాలకు భూధరాలని పేరు. అంటే భూమిని ధరించేవని అర్థం. వేదాల ప్రకారం విష్ణుః పర్వతానాం అధిపతిః. అందుకే పర్వతాలు పూజించబడుతున్నాయి. భూమి సమతుల్యతను కాపాడేవి పర్వతాలు. సాధారణంగా స్వయంభువుడుగా భగవానుడు వెలసిన క్షేత్రాలన్నీ అధికశాతం పర్వతాలపైనే ఉంటాయి. అదే పర్వతాలపై పురాణాల కాలంలో మునులు, యోగులు తపస్సులు చేసి జ్ఞాన సముపార్జన చేశారు. అటువంటి అనేక దైవీ భావనలు ఉండడం చేతనే పర్వతాలను పూజించడం, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వేదకాలం నుంచే జరుగుతున్నట్టు విజ్ఞులు చెబుతారు.

వరాహ లక్ష్మీనృసింహస్వామి ద్వయావతారుడుగా వెలసిన దివ్యధామం సింహగిరి. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణం చేయడం భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇస్తుందని చెబుతారు. సింహగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారికి విద్యాభివృద్ధి, ఉద్యోగప్రాప్తి, వివాహ అనుకూలత వంటి కోర్కెలు నెరవేరుతాయని పెద్దలు చెబుతుంటారు. కోర్కెలు లేకుండా సింహగిరి ప్రదక్షిణ చేసినవారు ఇహపర సౌఖ్యాలు పొందుతారని పండితుల మాట. భౌతికంగా సింహగిరి చుట్టుకొలత 32 కిలోమీటర్లు. సింహాచల క్షేత్ర మహత్యం ప్రకారం హిరణ్యకశిపుని సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం భూ ప్రదక్షిణ చేయడంతో సమ ఫలాన్ని ఇస్తుందని అంటారు.

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు

» నేడు, రేపు అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

» సిఫారసు లేఖలకు నో

» కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించరు

సింహాచలం, జూలై 19: గిరి ప్రదక్షిణ, తుదివిడత చందన సమర్పణ కార్యక్రమాల నేపథ్యంలో శని, ఆదివారాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్నిరకాల ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం కల్పిస్తామన్నారు. శనివారం ఉదయం 6.30 నుంచి 2.30 గంటల వరకు, 3 నుంచి రాత్రి 7 గంటల వరకు, 8.30 నుంచి తిరిగి 10 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ఆషాఢ పౌర్ణమి రోజున (ఆదివారం) వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, అనంతరం 3.00 గంటల వరకు స్వామి వారికి తుదివిడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణకు అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ నిర్విరామంగా భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆలయ బేడా మండపంలో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించనున్నందున భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో ఎటువంటి సిఫారసు లేఖలు అనుమతించబడవని ఈవో పేర్కొన్నారు. భక్తుల రద్దీ కారణంగా సింహగిరిపైకి ఎటువంటి వాహనాలను అనుమతించరని, దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలను నిలిపి దేవస్థానం ఏర్పాటుచేసిన వాహనాలలో మాత్రమే రాకపోకలు సాగించాలని ఈఓ కోరారు.

శారదానదికి జలకళ


అనకాపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న శారదానది

అనకాపల్లి టౌన్, జూలై 19: పట్టణంలో శారదా నది ప్రవాహం జోరందుకుంది. రెండు రోజుల క్రితం వరకు నదిలో నీటి ప్రవాహం సాధారణంగా ఉండేది. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురియడంతోపాటు పలు రిజర్వాయర్ల గేట్లను ఎత్తడంతో శారదా నదిలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో శారదా నది జలకళతో సంతరించుకుంది.

గరిష్ఠ స్థాయికి చేరువలో పెద్దేరు


గరిష్ఠ స్థాయికి చేరుతున్న పెద్దేరు జలాశయం నీటిమట్టం

మాడుగుల రూరల్: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువైంది. జలాశయం పరివాహక ప్రాంతంలో, ఎగువ ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం మధ్యాహ్నానికి 136.30 మీటర్లకు చేరిందని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో వస్తున్నందున శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

» కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

విశాఖపట్నం, జూలై 19: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ వైర్లు నేలపై పడిపోయే ప్రమాదముందని, రోడ్డుపై, పొలాల్లో వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైర్లు తెగిపోయి పడి ఉంటే పట్టుకోవద్దని, తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

భారీ వర్షాల సందర్భంగా విద్యుత్ సరఫరా పర్యవేక్షణ నిమిత్తం సర్కిల్, ఆపరేషన్ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు.

సంప్రతించాల్సిన ఫోన్ నంబర్లు

అనకాపల్లి డివిజన్ ఆఫీసు: 9490610022, కొంకోట డివిజన్ ఆఫీసు: 7382249866, నర్సీపట్నం డివిజన్ ఆఫీసు: 9491030714, పాడేరు డివిజన్ ఆఫీసు: 949061002.

విద్యుత్ సమస్యలపై వాట్సప్‌లో ఫిర్యాదు చేయవచ్చు

విశాఖపట్నం, జూలై 19: విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అపరిష్కృత దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలు వాట్సప్, మెసేజ్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చని ఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పాడేరులోని ఐటీడీఏ పరిధిలో గల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యలను 7382249881 నంబరుకు వాట్సప్, మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చొన్నారు. వర్షాల వల్ల పడిపోయిన, పాడైన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న వైర్లు, ఏరియా మొత్తం సరఫరా లేకపోవడం తదితర సమస్యలు పంపాలన్నారు. 1912 ద్వారా నేరుగా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని, లేదా 7382249881 నంబరుకు వాట్సప్, మెసేజ్ రూపంలో ఫిర్యాదు చేసేలా ఏర్పాటు చేశామన్నారు.

జీవో నంబరు-3ను పునరుద్ధరించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌కు వినతులు




జాటోత్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి, జనసేన నేత గంగులయ్య

పాడేరు రూరల్, జూలై 19 : అల్లూరి జిల్లా పర్యటనకు శుక్రవారం పాడేరు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌ను పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి గిరిజన భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుస్సేన్‌తో మాట్లాడుతూ గిరిజనులకు గుండెకాయవంటి జీవో నెంబరు-3ను పునరుద్ధరించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ జీవోను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, లగిశపల్లి పంచాయతీ సర్పంచ్ లకే పార్వతమ్మ పాల్గొన్నారు.

అలాగే జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌ను జనసేన పార్టీ అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంపూరు గంగులయ్య మర్యాద పూర్వకంగా కలిసి గిరిజన ప్రాంత సమస్యలను వివరించారు. జీవో నెంబరు 3 పునరుద్ధరణకు కృషి చేయాలని, గిరిజనుల ఉనికిని దెబ్బతీసే చట్టాలను వ్యతిరేకించాలని, అల్లూరి జిల్లాలో శిశుమరణాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, గిరిజనులతో పాటు గిరిజన సంపదకు భద్రత కల్పించే విషయంలో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టి సారించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉల్లి సీతారాం, సాలేబు అశోక్, నందోళి మురళీకృష్ణ, మజ్జి నగేష్‌పాల్గొన్నారు.

పలు సంఘాల వినతులు..

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్న పడాల్, ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ ఆధ్వర్యంలో కలిసిన సంఘం నాయకులు ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ రిజర్వేషన్‌కు చట్టబద్ధతకు జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకోవాలని, ఏకలవ్య విద్యాలయాల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని, పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారం చేయాలని, హైడ్రోపవర్ ప్రోజెక్టు అనుమతులు రద్దు చేయాలనే తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు.

సీపీఐ మండల సహాయ కార్యదర్శి అమర్ ఈఎంఆర్, ఏపీఆర్ పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఈఎంఆర్ స్కూల్స్‌కు భవనాలు నిర్మించాలని, ఏపీఆర్ స్కూల్స్‌లో వసతులు మెరుగుపర్చాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని, 1960 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండవ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, జీవో నెంబరు 3కు సమానమైన జీవోను తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలని వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో కలిసిన నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

పక్కా గృహాల లబ్ధిదారులకు 90 పని దినాల వేతనం

గూడెంకొత్తవీధి, జూలై 19 : పక్కా గృహాల లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాల వేతనం సిద్ధం చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను హౌసింగ్ ఏఈఈ సూరిబాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ఎఫ్ఏలతో ఏపీవో అప్పలరాజుతో కలిసి హౌసింగ్ ఏఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. పక్కా గృహాల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పనిదినాలు కేటాయించడం జరిగిందన్నారు. పునాదులు నిర్మించుకున్న లబ్ధిదారులకు 50 పని దినాలు, రూఫ్ లెవెల్ నిర్మించుకున్న వ్యక్తులకు మరో 40 పని రోజుల వేతనం నమోదు చేయాలన్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలకు పక్కా గృహాల లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. పక్కా గృహాలు సకాలంలో పూర్తి చేసేందుకు ఉపాధి సిబ్బంది పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు గిరీష్, చిట్టిపడాల్, సీవో అర్జున్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : నలుగురికి తీవ్రగాయాలు

జి.మాడుగుల, జూలై 19 : జి.మాడుగుల-చింతపల్లి ప్రధాన రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొక్కిరాపల్లి ఘాట్ మలుపులు వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సీకుంబంధ గ్రామానికి చెందిన కొర్రా వెంకట్, గెమ్మెలి కర్ణ, కాగా 12 ఏళ్ల బాలికతో పాటు మరో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న వీరబాబుకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో అక్కడి కొక్కిరాపల్లిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యాధికారి సంఘటన స్థలికి చేరుకొని వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం 108 వాహనం ద్వారా పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కొయ్యూరు, జూలై 19 : గురుకుల సీట్ల భర్తీలో అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రతీ విద్యా సంవత్సరంలో సుమారు 5 వేల మంది గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను ఆరోపించారు. శుక్రవారం కాకరపాడు గురుకుల కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి సాంగి జీవన్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గిరిజన విద్యార్థులందరూ చదువుకు దూరం కాకుండా ఉండాలనే మాటలు అధికారులు చేతల్లో చూపటం లేదన్నారు. ఇందుకు ఉదాహరణ గురుకుల కళాశాలల్లో ఇప్పటికీ రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహించకపోవటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విషయమై ఐటీడీఏ పీవో ఎందుకు దృష్టి పెట్టడం లేదో అర్థం కావడం లేదన్నారు. అనంతరం జీవన్‌కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో బాలికలకు అరకు, గూడెం, పాడేరులలో మాత్రమే గురుకుల కళాశాలలు ఉన్నాయని, కొయ్యూరులో బాలికల కళాశాల ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా భూషణ్

ఎస్ఎఫ్ఐ మండల కమిటీని శుక్రవారం జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాంబేలు భూషణ్, కార్యదర్శిగా వంతల నిర్మలను తో పాటు కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో జ్ఞానేశ్వరి భేటీ



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జ్ఞానేశ్వరి, లక్ష్మణరావు

చింతపల్లి, జూలై 19 : ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబరు-3 అమలుకు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కోరినట్టు అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి తెలిపారు. శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో పల్లాను కలిసిన ఆమె గిరిజన ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లినట్టు చెప్పారు. ఆమె వెంట టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మహిళా నాయకురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

వంతెన లేక గిరిజనం కష్టాలు

» కలగా బత్తునూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం
» వర్షాకాలంలో పలు గిరిజన గ్రామాల ప్రజల ఇక్కట్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న బత్తునూరు వాగులో రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

సీలేరు/ గూడెంకొత్తవీధి జూలై 19 : అల్పపీడన ప్రభావంతో ఇటీవలగా కురుస్తున్న వర్షాలకు మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులకు వంతెన సౌకర్యాలు లేకపోవడంతో కొండలపై నుంచి వచ్చే వర్షపు నీరు రహదారులపై నుంచే ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో పలు గ్రామాల గిరిజనులు నిత్యావసర సరుకులు కావాలన్నా, అత్యవసర చికిత్స కోసం వైద్య సేవలు పొందాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని సప్పర్ల నుంచి బత్తునూరు గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారిలో బత్తునూరు వాగుపై వంతెన నిర్మించలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బత్తునూరు, పాత్రునిగుంట, లేతమర్రి, బుగ్గిరాయి, మైనకోట, గొడుగురాయి, గుర్రాలగొంది గ్రామాలతో బాటు కొయ్యూరు మండలంలోని ఎల్.కొత్తూరు, పుట్టకోట, బొబ్బిలికొండ గ్రామాల గిరిజనులు వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ప్రాణభయంతో వణికిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బత్తునూరు వద్ద వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బత్తునూరుకు చెందిన జర్తా రామారావు, పొత్తూరు అప్పారావు, జర్తా చంటిబాబు, జర్తా కోటేశ్వరావుతో పాటు ఆయా గ్రామా ప్రజలు కోరుతున్నారు.

బురదమయంగా రహదారులు

» అధ్వానంగా బాలరేవుల-చీడిపల్లి, కునుకూరు మార్గాలు

కొయ్యూరు, జూలై 19 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండలపై గల పలు గ్రామాల రహదారులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. బూదరాళ్ళ పంచాయతీలో సుమారు 10 గ్రామాలకు ప్రధాన రహదారి అయిన బాలరేవుల-కునుకూరు, బాలరేవుల-చీడిపల్లి రహదారులు పరిస్థితి మరీ అధ్వానంగా మారాయి. కనీసం ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా సాహసం చేసినట్టే తయారైంది. బాలరేవుల నుంచి కునుకూరు మీదుగా వంతమర్రి, అన్నవరం, గిరిమండ తదితర గ్రామాలకు ప్రధాన రహదారి అయిన కునుకూరు రోడ్డు గత ప్రభుత్వ హయాంలో మిషన్ కనెక్టివ్ పాడేరు పథకంలో నిర్మించారు. ఈ రహదారి ప్రస్తుత వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. శుక్రవారం ఈ రహదారిలో ప్రయాణిస్తున్న జీపు అదుపు తప్పి ఓ ఎడమ పక్కకు ఒరిగి మట్టిలో కూరుకుపోయింది. అదే కుడి వైపునకు వెళ్లి ఉంటే లోయలో పడిపోయేది. అలాగే బాలరేవుల నుంచి చీడిపల్లి వెళ్ళే ప్రధాన రహదారి పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఈ రహదారిలో బురదమయంగా తయారై మోకాలు లోతుకు దిగుతుండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఇదీ బాలరేవుల- చీడిపల్లి రహదారి పరిస్థితి



అదుపు తప్పి బురదలో కూరుకున్న జీపు (పక్కన)

బొందుగుడ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మత్స్యలింగం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ, జూలై 19 : మండలంలోని బొందుగుడ ప్రభుత్వ బాలికల పాఠశాలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాబోధన, మెనూ అమలుపై అసంతృప్తి వ్యకం చేశారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు వేశారు. పుస్తకాలను చదివించారు. ఏడో తరగతి విద్యార్థులు తెలుగు సరిగా చదవలేకపోవడం ఏమిటని ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. అనంతరం వంట గదిని సందర్శించి మెనూ పరిశీలించారు. విద్యార్థులకు విద్యా నైపుణ్యంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. తాను మళ్లీ వస్తానని తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు నేతలు ఉన్నారు.

నీట మునిగిన కొల్లాపుట్టు రహదారి



వరద నీటిలో రహదారి

డుంబ్రిగుడ, జూలై 19 : బంగాళాఖాతంలో ఏర్పడినఅల్పపీడనం కారణంగా గడిచిన మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డుంబ్రిగుడ మండలంలోని కోర్రాయి పంచాయతీలోని కొల్లాపుట్టు వెళ్లే ప్రధాన రహదారి నీట మునిగింది. దీంతో ఆ దారిలో నుంచి పలు గ్రామాలకు వెళ్లాల్సిన గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కించుమండ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న సంపంగి గెడ్డ దాటలంటే ప్రమాదకరంగా మారింది. సంపంగి గెడ్డ పరిధి అనుకొని కితలంగా పంచాయతీ ప్రజల రవాణాకు కష్టతరంగా మారింది.

తాగునీరు అందించండి



డుంబ్రిగుడ, జూలై 19 : మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ నందివలస గ్రామస్థులు సురక్షిత తాగునీరు లేక సాగునీటినే అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న ఇంటింటి కొళాయి సుమారు 8 నెలల కిందట మరమ్మతు గురైంది. దీంతో గత్యంతరం లేక సాగునీటినే వాడుకుంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల నుంచి వచ్చే సాగునీరుకు పైపు గొట్టాలు అమర్చి కలుషిత బురద నీటినే తాగాల్సి వస్తోందని గిరిజన మహిళలు వాపోతున్నారు. ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండవాగు నుంచి వచ్చే కలుషిత బురద నీరు తాగడం వలన అనేక రకాల వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎన్నికలు

కొయ్యూరు, జూలై 19 : కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి నాయకుడిగా జి.నరేష్ హౌస్ పీపుల్ లీడరుగా జె.మోహిత్ ఎన్నికయ్యారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్పీఎల్ హెచ్‌పీఎల్‌తో పాటు వివిధ విభాగాలకు సంబంధించి నాయకులను ఎన్నుకునేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రిన్సిపాల్ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. విభాగాల వారీగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు.ఇందులో భాగంగా ఎస్‌పీఎల్‌కు నలుగురు విద్యార్థులు బరిలో నిలవగా జి.నరేష్ అత్యధికంగా 220 ఓట్లు సాధించాడు. అలాగే హెచ్‌పీఎల్ పదవికి ఏడుగురు బరిలో నిలువగా జె.మోహిత్ 178 ఓట్లు సాధించి విజేతగా నిలిచాడు. అనంతరం ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లితండ్రులతో వెల్‌కమ్ పార్టీ ఏర్పాటు చేసి వారితో సిబ్బంది, విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ కె.శివాజీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే సింహగిరి ప్రదక్షిణ

... 5వ పేజీ తరువాయి

దేవాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడ కూడా కొబ్బరికాయలు కొట్టేందుకు అనుకూల ఏర్పాట్లు చేశారు.

మార్గం పొడవునా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 29 వైద్య శిబిరాలు, 22 అంబులెన్స్‌లు, 390 ఎల్ఈడీ లైట్లు, 9 జనరేటర్లు, 6 ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో జీవీఎంసీ చేపడుతోంది. అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేయనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం వివిధ శాఖల అధికారులతో కొండదిగువన కలశం వద్ద, అడివివరం, హనుమంతువాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టిఎల్ గేటు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఐదు డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. 20వ తేదీ ఉదయం 6 నుంచి 21వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 98వ వార్డు పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. కొండ దిగువన 29 ప్రదేశాలలో, సింహగిరిపై మూడు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో దేవస్థానంతోపాటు పలు ప్రభుత్వ శాఖలు భక్తులకు అవసరమైన సలహాలు, సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఫోన్ నంబర్లు ఏర్పాటుచేశాయి. సింహాచలం దేవస్థానం (0891-2954944), జీవీఎంసీ (1800-42500009), నీటి సరఫరా, ప్రజా ఆరోగ్యశాఖలు (0891-2869111), విశాఖ పోలీస్ శాఖ (9390105353 లేదా 9330105355)

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించబోం

... 5వ పేజీ తరువాయి



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. అలాగే తన దృష్టికి వచ్చిన సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. మరో మారు ఈ ప్రాంతానికి వచ్చి రెండు రోజులు పర్యటిస్తానని హుస్సేన్ అన్నారు. ఈసందర్భంగా గిరిజన ఉద్యోగులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.బాబూరావునాయుడు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, బీజేపీ నేతలు పాంగి రాజారావు, కురసా ఉమామహేశ్వరరావు, కూడా కృష్ణారావు, గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ, అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న హుస్సేన్

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శుక్రవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయనకు తొలుతగా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ధీరజ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ మోదకొండమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, తదితరులు ఆయనకు శాలువాలు కప్పి మోదకొండమ్మ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. అక్కడి నుంచి ఆయన పీఎంఆర్‌సీలో వీఐపీ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, బీజేపీ నేతలు కురసా ఉమామహేశ్వరరావు, జె.ప్రభాకరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖిశేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మన్యాన్ని వీడని ముసురు

... 5వ పేజీ తరువాయి

అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి సీలేరు పరిసరాల్లోని పిల్లగెడ్డ వలసగెడ్డ, పాలగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సీలేరులోని అల్లూరివీధి, దుర్గావీధి తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి రావడంతో జనాలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రోజువారీ కూలీలు గత మూడు రోజులుగా పనులు లేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

అరకులోయలో..

అరకులోయలో శుక్రవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం 7 గంటల సమయంలో మోస్తరు వర్షం పడింది. అనంతరం మధ్యాహ్నం 3.30 సమయంలో మరో మారు మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో శుక్రవారం అరకు వారపు సంతకు గిరిజనం పెద్దగా రాలేదు. దీంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.



జీకే వీధిలో గృహం లోపలకు చేరిన వర్షపు నీరు

ముంచంగిపుట్టులో..

మండల పరిధిలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం పడింది. మండల కేంద్రంలో పలు ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఇళ్లలో ఉన్న పలు రకాల గృహోపకరణాలు, తిండి గింజలు తడిసిపోయాయి. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ కారణంగా ఆంధ్రా-ఒడిశాకు చెందిన 52 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆ పంచాయతీ పరిధిలో గత కర్లాపొదర్, మెట్టగూడ, లక్ష్మీపురం, తుమిడిపుట్టు, కోడాపుట్టు, ముషులపుట్టు, ఉబ్బెంగుల, మొంజగూడ, సంగంవలస, దాబుగూడ, దొరగూడ, తుడుమురాయి, మెత్తగూడ తదితర ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉగ్రరూపం దాల్చాయి. దాని కారణంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దొరగూడ ప్రాంతీయులు అత్యవసర పనులను నిమిత్తం పంచాయతీ కేంద్రానికి వచ్చేందుకు శుక్రవారం అష్టకష్టాలు పడ్డారు. వారు ఆనపకాయల డిప్పలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ని నడుముకి కట్టుకొని ఒకరికి ఒకరు చేతులు పట్టుకొని సాహసోపేతంగా గెడ్డను దాటాల్సి వచ్చింది.

సంక్షిప్తంగా..

పింఛన్ల పంపిణీపై విచారణ

కొయ్యూరు, జూలై 19 : జాజులబంధ గ్రామానికి చెందిన నలుగురికి ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్లు అందలేదంటూ వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం మూలపేట, బాలారం పంచాయతీ కార్యదర్శులు విచారణ చేపట్టారు. పింఛనుదారులు మర్రి రామారావు, వంతల కోనే, పాంగి బిషులకు వారి పింఛను మొత్తం బ్యాంకులో జమ అయినా ఆ విషయం గమనించలేదని తేలింది. వీరిలో బిషుకు సంబంధించి పింఛను మొత్తాం బ్యాంకులో జమ అయినప్పటికీ సదరు అకౌంట్ మనుగడలో లేకపోవడంతో ఇబ్బంది ఎదురైంది. కాగా, పాంగి సుబ్బారావు పింఛను డౌనూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గోవింద్ లాగిన్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలో జమ అయింది. అతడి పింఛను మొత్తం వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉందని చెప్పారని, ఆ మొత్తం ఈ నెల 18న తన మనవడి ఫోన్‌పే అకౌంట్‌లో వేశారని సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఐటీడీఏ పీవోకు అందజేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాడేరు రూరల్, జూలై 19 : మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఈపీడీసీఎల్ పాడేరు డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు, ప్రజలకు కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. మరో రెండు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ఎక్కడైనా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినా, విద్యుత్ వైర్లు తెగిపడినా, స్తంభాలు విరిగిపడినా వెంటనే కంట్రోల్ రూమ్ నెం.9490610026కు సమాచారం అందించాలన్నారు.

గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు చెక్‌పవర్ కల్పించాలి



పల్లాతో మాట్లాడుతున్న పాండురంగస్వామి

పాడేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు చెక్ పవర్ కల్పించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ డివిజన్ నేత, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి శుక్రవారం అమరావతిలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధికార ప్రతినిధి, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, టీడీపీ నేతలు కూడా వెంకటరావు, స్వామి, రాజు, రవి పాల్గొన్నారు.

న్యాయం చేయండి

» ఎన్‌హెచ్ నిర్వాసితుల వినతి



మాట్లాతున్న నిర్వాసితులు

జి.మాడుగుల, జూలై 19 : తను న్యాయం చేసే విషయంలో పునర్ పరిశీలించాలని జాతీయ రహదారి 516-ఈ నిర్వాసితులు కోరారు. శుక్రవారం వారు విలేకరుల మాట్లాడుతూ ఇది వరకు బాధితులకు విడుదల చేసిన నకలులో ఎక్కువ నష్టపోయిన వారికి తక్కువగా, తక్కువ నష్టం కలిగిన వారికి ఎక్కువ పరిహారం మంజూరు అయినట్లు విడుదల కావడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి అధికంగా నష్టాలు పొందిన బాధితులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వర్షాకాలంలో పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



రైతులకు అవగాహన కలిగిస్తున్న డా.శాలిని

చింతపల్లి, జూలై 19 : ఆదివాసీలు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చల్లంగి శాలిని తెలిపారు. రెండు రోజుల కిందట పెదబరడ గ్రామంలో క్రిమిసంహారక మందు పిచికారి చేసిన గడ్డిని ఆహారంగా తీసుకున్న పశువు మృతి చెందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ గ్రామంలో పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలం పశువుల్లో పలు వ్యాధులు వ్యాప్తిచెందుతాయన్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యశాలకు వచ్చి మందులు తీసుకొని వెళ్లాలన్నారు. వ్యాధుల తీవ్రత అధికంగా ఉంటే గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఈ సీజన్‌లో పశువులను కాపాడుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పశువులు, మేకలకు క్రమంగా టీకాలు వేయించాలన్నారు.

నేడు పెదబరడలో ప్రత్యేక పశువైద్యశిబిరం

పెదబరడ పంచాయతీ కేంద్రంలో శనివారం ప్రత్యేక పశువైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని పశువైద్యాధికారి చాలిని తెలిపారు. గ్రామంలోనున్న పశువులు, మేకలు, గొర్రెలకు సాధారణ తనిఖీలు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.